క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన ఉంటుందని, ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

లోకనాథరెడ్డి సేవలు ప్రశంసనీయం



లోకనాథరెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

గుడిపాల: లోకనాథరెడ్డి సేవలు ప్రశంసనీయమని ఇందిరాక్రాంతి ఏపీయం సుధారాణి అన్నారు. వెలుగు సీసీ లోకనాథరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం వెలుగు కార్యాలయంలో సన్మానం చేశారు. ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో 22 ఏళ్లు పనిచేసి అందరి మన్ననలు పొందిన వ్యక్తి లోకనాథరెడ్డి అన్నారు. సంఘం సభ్యులు వద్ద ఎటువంటి రిమార్క్ లేకుండా ఉద్యోగంలో ఎక్కడా ఏ చిన్న తప్పు చేయకుండా నేడు పదవీ విరమణ పొందడం చాలా బాధాకరంగా ఉందన్నారు. అనంతరం వెలుగు సిబ్బంది, సంఘమిత్రలు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

నేడు వైద్య శిబిరం

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 నుంచి 4 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన, భీముడి పాత్రధారులు

గుడిపాల: పానాటూరు గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్యోధనుడి ప్రతిమను బంకమట్టితో తయారుచేసి దుర్యోధన, భీముడు పాత్రధారులు ఆలపించిన పద్యాలు అలరించాయి. అనంతరం బంక మట్టి కోసం జనం ఎగబడ్డారు. అనంతరం మహాభారత హరికథలో దుర్యోధన ఘట్టాన్ని భాగవతారిణి హేమలత భక్తులకు ఆకట్టుకునేలా వినిపించింది. అనంతరం దుర్యోధనుడికి కర్మక్రియలు నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన అమ్మవారి అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

6 గంటలు కరెంట్ కట్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఆదివారం వచ్చిన గాలీవానకు 6 గంటలకు పైగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సాయంత్రం స్థానిక కొంగారెడ్డిపల్లి సెక్షన్ పరిధిలో కరెంట్ సరఫరా ఆగిపోవడంతో, చుట్టూ చీకటి, దోమలతో ఇబ్బంది పడ్డారు. సెక్షన్ పరిధిలో 8 స్తంభాలపై చెట్టుకొమ్మలు పడటంతో అంతరాయం కలిగింది. ఈఈ మునిచంద్ర, డీఈ ప్రసాద్, ఏఈ రాములు అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు.

కమ్మేస్తున్న ప్లాస్టిక్ భూతం!

- చిత్తూరులో విచ్చలవిడిగా ప్లాస్టిక్ విక్రయాలు
- ఇప్పటికే నగరంలో 40 మైక్రాన్ల కవర్లు నిషేధం
- తనిఖీలు పక్కకు పెట్టి.. ఆదేశాలు పట్టించుకుంటే ఒట్టు
- పర్యావరణానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు





చిత్తూరు డంపింగ్ యార్డు వద్ద కుప్పలుగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

చిత్తూరు అర్బన్: ఒక చిన్న ప్లాస్టిక్ కవర్ భూమిలో మట్టితో పాటు మట్టిగా మారాలంటే 500 నుంచి వెయ్యేళ్ల సమయం పడుతుందని అంచనా. మరి మనం నిత్యం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులు మట్టిగా మారాలంటే ఈ యుగం సరిపోతుందా..? చిత్తూరులో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై ఓ నిబంధన ఉంది. నగర పరిధిలో 40 మైక్రాన్లకంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించకూడదు. గత పాలకవర్గం ఈ మేరకు తీర్మానం చేసి, దాన్ని ఆమోదించింది. కానీ నగరం ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. వీటిని నియంత్రించకపోతే భవిష్యత్తులో ప్లాస్టిక్ భూతం అందర్నీ కబళించేయడం ఖాయంగా కనిపిస్తోంది.

నిబంధనలు ఇలా...

20 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల్ని ఉపయోగించకూడదని 2007లో, 40 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ వాడొద్దని 2015లో నాటి చిత్తూరు మునిసిపల్ పాలక వర్గాలు తీర్మాలు చేశాయి. అప్పట్లో కార్పొరేషన్ అధికారులు వరస దాడులు చేస్తూ పెద్దఎత్తున ప్లాస్టిక్ వస్తువులు సీజ్ చేయడం, జరిమానాలు వేయడం చేశారు. ప్రజల్లో కూడా ప్లాస్టిక్ వినియోగంపై మార్పు వచ్చింది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నూలు, నారతో చేసిన సంచుల్ని ఉపయోగించడం ప్రారం భించారు. ఫలితంగా వ్యాపారులు కూడా ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలను తగ్గిస్తూ వచ్చారు. ఒక దశలో ప్లాస్టిక్ కవర్ల పరిమాణంతో సంబంధం లేకుండా దాదాపు నగరంలోని వ్యాపారులంతా కలిసికట్టుగా కవర్లను నిషేధించారు. కానీ కాలక్రమేణ కార్పొరేషన్ అధికారుల ఉదాసీన వైఖరి వల్ల ఇప్పుడు చిత్తూరులో ప్లాస్టిక్ వినియోగం తారస్థాయికి చేరుకుంది.

పర్యవేక్షణ శూన్యం

తక్కువ మందంతో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వినియోగంపై నగర పాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రతిరోజూ ఓ దుకాణాన్ని తనిఖీ చేసి, కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడం చేయాల్సిన యంత్రాంగం పని ఒత్తిళ్లతో పేరు చెప్పి తనిఖీలకు వెళ్లడం మానేశారు. ప్రస్తుతం నగరంలోని పలు హోటళ్లల్లో 15 మైక్రాన్ల మందం ఉన్న కవర్లను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. వీటిలో వేడి ఆహార పదార్థాలు ఉంచినప్పుడు ప్లాస్టిక్‌లోని రసాయనాలు.. ఆహార పదార్థంలో కలిసిపోతోంది. ఫలితంగా ప్రజలు శ్వాసకోశ, ఉబ్బసం లాంటి వ్యాధుల బారిన పడుతున్నారు. కొందరు బడా ప్లాస్టిక్ వ్యాపారుల ద్వారా ఒకరిద్దరు కార్పొరేషన్ అధికారులకు నెలసరి మామూళ్లు వెళుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పర్యావరణంపై ప్రభావం

హోటళ్లు, పెళ్లిళ్లు, టీ విక్రయాలు, థియేటర్లు, వివాహ మండపాలు, జన్మదిన వేడుకలు, పూల మార్కెట్లు, కూరగాయల మార్కెట్లు, ఇలా ప్రతీ ఒక్కచోట ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్నారు. ప్రజలు వీటిని ఇంటికి తీసుకొచ్చాక చెత్త కుప్పల్లో, వీటిని మురుగునీటి కాలువల్లో పడేస్తున్నారు. ఇవి కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచిపోతుండడం వల్ల వర్షాలు పడినప్పుడు మురుగు నీటి కాలువల్లోని నీరంతా నివాసాలపైకి వచ్చేస్తోంది. కొన్ని సమయాల్లో మురుగునీళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోతుండంతో దోమల సంఖ్య ఎక్కువగా వృద్ధి చెందుతోంది.



8వ డివిజన్ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

అందరూ సహకరించాలి



ప్లాస్టిక్ విక్రయాలపై ఈరోజు నుంచే నిత్యం తనిఖీలు చేపట్టాలని ఆదేశిస్తాం. సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య విభాగం దీనిపై ప్రత్యేక దృష్టి సారించేలా చూస్తాం. ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా మానేసి, పర్యావరణానికి హాని చేయకుండా సహకరించాలని కోరుతున్నాం. –నరసింహ ప్రసాద్, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం గణపతి పూజ, కలశపూజ, హోమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, సిద్దయ్య మూలవర్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

వరసిద్ధుని సన్నిధిలో శ్రీకాళహస్తి ఈవో



చిత్ర పటం అందుకుంటున్న ఈవో

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని ఆదివారం శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో టి.బాపిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చూశారు. స్వామివారి ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు ఉన్నారు.

ఉన్నతాశయాలతో ముందుకు సాగాలి



ప్రతిభా అవార్డులు అందుకున్న ఉత్తమ ఫలితాలు సాధించిన పది విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఉన్నతాశయాలతో ముందుకు సాగాలని యాదవ ఉద్యోగుల సొసైటీ జిల్లా అధ్యక్షులు లింగమూర్తి యాదవ్ అన్నారు. ఆ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉన్నత ఆశయంతోపాటు పట్టుదల ముఖ్యమన్నారు. జిల్లాలో పదవ తరగతిలో 500కు పైగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తమ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించామన్నారు. ప్రతి ఏటా ఈ పురస్కారాలు ఆనవాయితీగా ఇస్తున్నట్లు చెప్పారు. గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, జ్ఞాన సముపార్జన, సాధన ముఖ్యమైన అంశాలన్నారు. వాటిని ప్రతి విద్యార్థి నిరంతరం పాటించాలని చెప్పారు. అనంతరం 200 మంది విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సురేష్, కోదండ, అశోక్, లక్ష్మీపతి, శ్రీరామ్మూర్తి, చెంగల్‌రాయ మండడి, విక్రమన్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ విడుదల



మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతి నగరంలో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో తొలిసారి జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు దేశంలోని మొత్తం 29 రాష్ట్రాల నుంచి యువజన సమాఖ్య ప్రతినిధులు వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ నాయకులు మల్లికార్జున, నాగచైతన్య, రంగారావు, యశ్వంత్, ఏఐవైఎఫ్ నాయకులు బాలాజీరావు, మణిరాజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని మల్లకుంట, పుణ్యసముద్రం గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేయిస్తారని వివరించారు. వైద్యాధికారులకు ప్రజలు సహకరించి వైద్య సేవలను పొందాలని సూచించారు.

నేడు డిజిటల్ నైపుణ్యంపై రైతులకు అవగాహన

గుడిపాల: రైతులకు ఆధునిక డిజిటల్ నైపుణ్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు బసవాపల్లె పంచాయతీలోని రైతుసేవా కేంద్రంలో రైతన్నలకు ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగించనున్నట్లు చెప్పారు. సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, వ్యవసాయ యాప్‌లు, డిజిటల్ పేమెంట్స్, యూట్యూబ్ చానల్స్ నిర్వహణ, వాతావరణం, మార్కెట్ ధరల గురించి రైతులకు అవగాహన కల్పించనున్నారు. కావున రైతులందరూ తప్పకహాజరు కావాలని చెప్పారు.

నారసింహనపల్లెలో మహాభారత యజ్ఞం ప్రారంభం

తవణంపల్లె: మండలంలోని నారసింహనపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఆదివారం మహాభారత యజ్ఞం ప్రారంభమైనట్లు గ్రామస్తులు తెలిపారు. మహాభారత యజ్ఞం ఈ నెల 4వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉంటుందని వివరించారు. ఆలయంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులకు భక్తితో ఆదివారం ఉదయం అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 4వ తేదీన ధ్వజారోహణం, 13వ తేదీన బలిబండి, 14వ తేదీన ద్రౌపదీదేవి కల్యాణం, 16వ తేదీన అర్జున తపస్సు 18వ తేదీన ఉత్తరగోగ్రహణం, 20వ తేదీన విలవంతుని వధ, 21వ తేదీన దుర్యోధన వధ, అగ్నిగుండ ప్రవేశం, ధర్మరాజులు పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. భాగవతార్ శివకుమారిచే హరికథా గానాలాపం ఉంటుందని వివరించారు. ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు శ్రీ వెంకటేశ్వర కళానాట్య మండలిచే రాత్రి నాటకం ఉంటుందని పేర్కొన్నారు. ఉభయదారులు, పరిసర గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞానికి భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థులు

ఐరాల: చిన్నారులు విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించడం, గణితం, క్విజ్ తదితర అంశాల్లోని మెలకువలను వివరించారు. అనంతరం ఆట విడుపుగా విద్యార్థులతో మ్యూజికల్ చైర్స్ ఆడించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరాలకు రావడం వలన వివిధ రంగాల్లో విజ్ఞానం పెంపొందించుకుంటారని చెప్పారు. వేసవిలో నిర్వహించే విజ్ఞాన శిబిరాన్ని పిల్లలంతా సద్వినియోగం చేసుకోవాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కుంభాభిషేకం





కుంభాభిషేకంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న విజయానందరెడ్డి, విగ్రహాలను ప్రతిష్టిస్తున్న పండితులు





కుంభాభిషేకంలో పాల్గొన్న విజయానందరెడ్డి సతీమణి, హోమం, పూజలు చేస్తున్న వేదపండితులు

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పం గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజులు, మునేశ్వరుల కుంభాభిషేకం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కుంభాభిషేకానికి చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి దంపతులు హాజరయ్యారు. వేదపండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. కుంభాభిషేకంలో భాగంగా నాలుగో కాల యాగశాల పూజహోమం, మహా సంకల్పం, విశేషద్రవ్య హోమం, కలశారాధన, ఆలయంలో గోపుర కలశాల మహాకుంభాభిషేకం, గర్భగుడిలో మహాకుంభాభిషేకంతోపాటు అన్నదానం చేశారు. రాత్రి గ్రామంలో కోలాటం నిర్వహించారు.

విట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సాహితి



అనీష్



మన్యతరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్వహించే విట్ ట్రిబుల్‌ఈ–2025 ప్రవేశ పరీక్షల్లో పీఎస్ఎన్ వివేకానంద విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆ పరీక్షల ఫలితాలను విట్ యూనివర్సిటీ నిర్వాహకులు ఆదివారం విడుదల చేశారు. ఈ మేరకు నగరంలోని మురుగానపల్లిలో ఉన్న పీఎస్ఎన్ వివేకానంద కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఆ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన సాహితీ ఆల్ ఇండియా స్థాయిలో 2,153, అనీష్ 4,653, మన్యత రెడ్డి 9,585, తేజా 10,770, పవన్‌కల్యాణ్ 11,381, యోహిత్‌సాయి 13,971, జిష్ణురెడ్డి 18,306 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి, అధ్యాపకులు ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కమనీయం.. లక్ష్మీనారాయణుడి కల్యాణం



దీనదయాల్ కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ సిబ్బంది

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా జరిగింది. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొల్పిన అర్చకులు స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా జరిగింది. చెన్నై నగరానికి చెందిన దీనదయాల్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఉభయదారులకు స్వామివారి చిత్రపటాన్ని అందించి ఆలయ సిబ్బంది సత్కరించారు.

చిరు జల్లులకే జలమయం



ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగునీరు

చిత్తూరు అర్బన్: నగరంలోని వెంగళరావు కాలనీ వాసులకు చిన్నపాటి చినుకులు పడినా చిక్కులు తప్పవు. నగరంలో ఆదివారం కురిసిన ఓ మోస్తరు వర్షానికి వెంగళరావు కాలనీ ప్రాంతం కాలువ మురుగునీటితో కలిసి జలమయమైంది. కొంగారెడ్డిపల్లె, ఫేస్ పిల్లార్ రోడ్డు, సత్యనారాయణపురం ప్రాంతాలకు చెందిన మురుగునీళ్లు ప్రవహించడానికి రీడ్సుపేట ద్వారా వెంగళరావు కాలనీ వైపు మురుగునీటి కాలువ నిర్మించారు. వెంగళరావు కాలనీ నుంచి సీఎంటీ రోడ్డు వైపు ఉన్న కాలువ లెవల్స్ సరిగ్గా లేకపోవడంతో వర్షం పడ్డ ప్రతి సారీ మురుగునీళ్లు కాలనీలోకి వచ్చేస్తున్నాయి. వందలాది మంది మునిసిపల్ పారిశుధ్య కార్మికులు, సిబ్బంది కాపురముంటున్న వెంగళరావు కాలనీలో ఈ సమస్యను పరిష్కరించి.. కాలువను రీడ్స్‌పేట వైపు పునర్నిర్మించాలని సఫాయి కర్మచారి జాతీయ చైర్మన్ వెంకటేశన్ తన రెండుమార్లు పర్యటనలో మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అయినాసరే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో మురుగునీళ్లు కాలనీ వాసుల ఇళ్లలోకే వచ్చేస్తున్నాయి.



వెంగళరావు కాలనీలోకి వెళుతున్న కాలువ నీళ్లు





వెంగళరావు కాలనీలో ప్రవహిస్తున్న మురుగునీళ్లు



ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో.., చిత్తూరు కమిషనర్ బంగ్లా రోడ్డుపై నేలకూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది